జిల్లా సరాసరి వర్షపాతం 13.9మిల్లీమీటర్లు

హనుమకొండ, జూలై 28 : జిల్లాలో ఆదివారం వరకు సరాసరి వర్షపాతం 13.9 మిల్లీ మీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా నడికూడ మండలంలో 26.5మిల్లీమీటర్లు, అత్యల్పంగా వేలేరులో 6.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే భీమదేవరపల్లి మండలంలో 7.9, ఎల్కతుర్తిలో 13.6, కమలాపూర్‌లో 22.8, హసన్‌పర్తిలో 17.5, ధర్మసాగర్‌లో 9.2, కాజీపేటలో 10.6, హనుమకొండలో 9.9, ఐనవోలులో 7.9, పరకాలలో 18.8, దామెరలో 11.7, ఆత్మకూరులో 13.6, శాయంపేట మండలంలో 18.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

కొప్పూరులో వర్షానికి కూలిన ఇల్లు

భీమదేవరపల్లి : వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. మండలంలోని కొప్పూరు గ్రామంలోని పెంకుటిల్లు వర్షాల కారణంగా మట్టిగోడలు తడిసి కూలిపోయింది. ఆ సమయంలో ఆ గదిలో కుటుంబసభ్యులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన తిరుపతికి ఉన్న ఇల్లు కూలిపోవడంతో అతడి కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, జూలై 28 : అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు రూ.16,19,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ప్రజా ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు కమలాపురం రమేశ్, మాజీ ఎంపీపీలు బీరం సునంద-సుధాకర్‌రెడ్డి, జన్ను మల్లయ్య, గోపు మల్లికార్జున్, మార్క సుమలత-రజినీకర్ గౌడ్, జడ్పీటీసీలు అంబాటి రాజస్వామి, కక్కెర్ల రాధికా-రాజు, వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్ ఇస్తాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట, జూలై 28 : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేటలోని మండల పరిషత్ హాల్‌లో ఆదివారం 82 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క దరఖాస్తు పెండింగ్ లేకుండా రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయ నిధిని అందిస్తామన్నారు. ఎవరికి ఇబ్బంది ఉన్నా నిమ్స్ ఆస్పత్రికి వెళితే ఎంత పెద్ద జబ్బు అయినా చికిత్స అందుతుందన్నారు. డబ్బులు లేకపోతే ఎస్టిమేట్స్ తెస్తే ఎల్‌వోసీ ముందే ఇస్తామన్నారు. నాలుగున్నర లక్షల ఇండ్లు పేదలకు కట్టిస్తామన్నారు. వచ్చే నెల 2లోపు రూ.2లక్షల రుణమాఫీ చేయబోతున్నామన్నారు. ఏపీవో రంజిత్, దూదిపాల బుచ్చిరెడ్డి, చల్లా చక్రపాణి, రవి పాల్గొన్నారు.

ఆగస్టు చివరికల్లా అందుబాటులోకి నయీంనగర్ బ్రిడ్జి

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హనుమకొండ చౌరస్తా, జూలై 28 : దశాబ్దాల కలగా ఉన్న నయీంనగర్ బ్రిడ్జి(పెద్దమోరీ) పనులు చివరి దశకు చేరుకున్నాయని, ఆగస్టు చివరికల్లా అందుబాటులోకి రానున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, తేలికపాటి వర్షాలకు సైతం కూరుకుపోతున్న పెద్దమోరీ వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో కోతలకు గురైన ప్రదేశాలు, అక్రమ నిర్మాణాలను కూల్చి పనులు చేస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మడికొండ : గ్రేటర్ 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో శివశక్తి మహంకాళీ బోనాల జాతరలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి బోనం సమర్పించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయశ్రీ, జక్కుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

WANTED

jobs Apply Now!

★Wanted PRO's for MBBS in Abroad Education. Please Contact Phone No. 8121554649.
NTW-314856

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఐనవోలు, జూలై 28 : తోటి స్నేహితుడు అనారోగ్య సమస్యతో అకాల మరణం చెందాడు. దీంతో మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 1993-94లో పదో తరగతి కలిసి చదువుకున్న స్నేహితులు రూ.35 వేలను జమ చేసి ఆదివారం పున్నేల్ గ్రామానికి చెందిన మోర సురేశ్‌కుమార్ (45) కుటుంబ సభ్యులకు అందజేశారు. బ్యాచ్‌మేట్స్ నరిగె కుమార్, అడుప కిషన్, సీహెచ్ యాదగిరి, అలుగూనూరి శ్రీనివాస్, హారతి ఉన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ గౌస్‌పాషా కుమారుడు అబ్దుల్ ఖాదిర్‌పాషా ఇటీవల బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేజీఎఫ్ యూత్ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, 50 కేజీల బియ్యం అందజేశారు.

బాంబుల మోతతో జనం బెంబేలు

- దుమ్ము, ధూళితో ఇక్కట్లు
- జయగిరి నుంచి హసన్‌పర్తికి వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- రహదారిపై వాహనదారులను ఆపి బాంబులను పేల్చుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

రహదారిపై వాహనదారులను ఆపి బాంబులు పేల్చుతున్న నిర్వాహకులు

హసన్‌పర్తి, జూలై 28 : మండలంలోని జయగిరి నుంచి హసన్‌పర్తికి వెళ్లే మార్గమధ్యలో బండి మెట్టుగుట్ట ఉంది. ఈ గుట్టపైన ఓ కంపెనీకి చెందిన వారు గ్రానైట్ క్వారీ నడిపిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రోడ్డుపై వాహనదారులను ఆపి బాంబులు పేల్చుతున్నారు. భారీ శబ్దాలతో గ్రానైట్ రాళ్లు ముక్కలు ముక్కలుగా ఎగిరి పడుతుండడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతుల పెట్టుకొని వెళ్తున్నారు. పేలుళ్లతో వాతావరణంలో కలుస్తున్న దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. రక్షణ చర్యలు తీసుకోరా? అని నిర్వాహకులను నిలదీస్తే మా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటామని వాహనదారులను బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ రహదారిపై నుంచే జయగిరి, అనంతసాగర్, మడిపల్లి, మునిపల్లి గ్రామాల ప్రజలు హసన్‌పర్తికి నిత్యం వచ్చి పోతుంటారు. కొన్నేళ్ల క్రితం జయగిరి నుంచి చింతగట్టుకు వెళ్లే దారిలో ఓ గుట్టుపైన బాంబు పేల్చుతుండగా, అటుగా వెళ్తున్న వ్యవసాయ కూలీ తలపై రాయి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ కెనాల్ బ్రిడ్జి..

గ్రానైట్ క్వారీ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ బిడ్జి ఉంది. ఈ బిడ్జిని 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భారీ గ్రానైట్ లారీలు ఈ బిడ్జి పైనుంచి వెళ్తుండడంతో ఇది ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే లారీ డ్రైవర్లు వెనుక వస్తున్న వాహనదారులకు సైడు ఇవ్వకుండా వెళ్తున్నారు. రోడ్డుపైన గుంతల్లో బురద నిండి వాహదారులు అందులో పడి ప్రమాదాలకు గురతున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో వాహనదారులు, ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రానైట్ క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రిడ్జిపై నుంచి వెళ్తున్న గ్రానైట్ లారీ

శిథిలావస్థలో ఉన్న కెనాల్ బ్రిడ్జి

ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు

ప్రయాణికులకు ఇ బ్బందులు కలుగజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ గ్రా నైట్ క్వారీలో ఉదయం, మధ్యాహ్నం బాంబ్ బ్లాస్టింగులు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ప్రజలకు రక్షణ ఇవ్వడమే మా డ్యూటీ. వెంటనే క్వారీని పరిశీలించి వారికి పరిమిషన్ ఉన్నదా? లేదా? ఏ వేళల్లో బ్లాస్టింగ్ చేస్తున్నారని విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

- హసన్‌పర్తి సీఐ జవ్వాజి సురేశ్

ఈ దారిపై వెళ్లాలంటేనే భయం..

వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై ఉన్న బ్రిడ్జి కూలిపోతే గ్రామంలోని 30 మంది ఆటోడ్రైవర్లు జీవనోపాధి కొల్పోతారు. పెద్ద లారీలు ఇటు రాకుండా చర్యలు తీసుకోవాలి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఆటోలు, ప్రయాణికులను ఆపి బాంబులు పేల్చుతున్నారు. ఉదయం బాంబులు పేల్చొద్దని చెప్పినా వినిపించుకోవడం లేదు. గ్రానైట్ క్వారీని బంద్ జేయించాలి.

- చింత శ్రీనివాస్, ఆటోడ్రైవర్, జయగిరి

నేడు 'నిధి ఆప్కే నికత్'

ఈపీఎఫ్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి

న్యూశాయంపేట, జూలై 28 : ఈపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం నిధి ఆప్కే నికత్ సమావేశం సోమవారం మడికొండలోని గణేశా ఎకోపెట్ ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ వరంగల్ రీజినల్ కమిషనర్ అర్జున్ తుక్రాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈపీఎఫ్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

హనుమకొండ, జూలై 28 : భట్టుపల్లిలో సోమవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ సబ్ డివిజన్ ఉపతపాలా పర్యవేక్షకులు మూల రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు పోస్టాఫీస్ ద్వారా అమలవుతున్న పథకాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

కట్ట మైసమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్

ఆత్మకూరు, జూలై 28 : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పెద్ద చెరువు కట్ట మైసమ్మకు ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువు కట్ట పనులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రూ.74.50లక్షలు కేటాయించారన్నారు. చెరువు కట్ట కింద వెయ్యి ఎకరాలు సాగు అవుతున్నదని, వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువులోకి నీరు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. త్వరలోనే చెరువు కట్టకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేయిస్తామన్నారు.

880 గ్రాముల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు, బైక్ స్వాధీనం

సుబేదారి : గంజాయితో పట్టుబడిన ఇద్దరు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. సుబేదారి పోలీసు స్టేషన్‌లో సీఐ సత్యనారాయణరెడ్డి ఇద్దరు నిందితుల అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా మంగపేట మండలం రామక్కపేటకు చెందిన చౌలం దొరబాబు అలియాస్ వంశీ, కమలాపురంకు చెందిన మంత్రి సంజయ్ గంజాయికి అలవాటు పడ్డారు. హనుమకొండలోని వంశీ రూమ్‌కు గంజాయి సేవించడానికి సంజయ్ వచ్చాడు. ఇద్దరు కలిసి 880 గ్రాముల గంజాయి ప్యాకెట్లతో బైక్‌పై హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుంచి బస్‌స్టేషన్‌కు వెళ్తుతుండగా సుబేదారి ఎస్సై శ్రీకాంత్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. వంశీ, సంజయ్‌ను అరెస్టు చేసి గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మత్తు పదార్థలు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

నయీంనగర్, జూలై 28 : గంజాయి సేవిస్తున్న వ్యక్తులపై కేయూసీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజ్ కుమార్ ఆదివారం తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో పెగడపల్లి గ్రామం వద్ద చెట్లపొదల్లో ముగ్గురు యువకులు ఖానాపూర్‌కు చెందిన పుల్లూరి రాజేశ్, పాపవత్ అనిల్, ఎల్లాయిగూడెం చిన్నరావుపేటకు చెందిన అలువాల విపిన్‌కుమార్ అనే వ్యక్తులు గంజాయి సేవిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 50గ్రాములు ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సై, సిబ్బంది షబ్బీర్, శ్యామ్ రాజ్, రజినీ కుమార్, సతీశ్ కుమార్‌ను సీఐ సంజీవ్ అభినందించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, కవులు, రచయితలు

సమాజాన్ని చైతన్య పరిచేది రచయితలే

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
- 'నేను - నా జీవిత ప్రస్థానం' పుస్తక ఆవిష్కరణ

హనుమకొండ, జూలై 28 : సమాజాన్ని చైతన్య పరిచేది రచయితలు, మేధావులేనని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్‌రెడ్డి భవన్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన రిటైర్డ్ అధికారి కాయిత వెంకటి రచించిన నేను - నా జీవన ప్రస్తానం పుస్తకాన్ని శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా సమాజంలో అసమానతలు తొలగలేదన్నారు. నష్టాల పేరుతో కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను మూసి వేస్తున్నదని దీంతో పేదలు, దళితులు, గిరిజనులే ఎక్కువగా నష్టపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో గిరిజా మనోహర్ బాబు, నెల్లుట్ల రమాదేవి, వల్లంపట్ల నాగేశ్వరరావు, అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిధి, పల్లేరు వీరస్వామి, కార్యదర్శి మార్క శంకర్ నారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, వెటర్నరీ అధికారి హరినాథరావు, రచయిత కాయిత వెంకటి దంపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మీడియా అకాడమీ చైర్మన్..

హనుమకొండలోని ప్రజాభవన్(ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మీడియా అకాడమీ చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల గురించి మాట్లాడారు.

'అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు'

దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28 : విద్యార్థి సంఘాలపై ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ప్రైవేట్ జూనియర్ కాలేజీ యజమాన్యాల దిష్టిబొమ్మ దహనం చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు హకీంనవీద్, మంద నరేశ్, బొట్ల మనోహర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కాలేజీలు చేస్తున్న విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే కాలేజీ అనుమతి పొంది అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీలు నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరామని, అందుకే ప్రైవేట్ జూనియర్ కాలేజీల యజమానులు తమపై బురద జల్లుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకుడు రోహిత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు హర్షం చరణ్, ఇప్ప భారత్, ప్రణయ్, బీఎస్ఎఫ్ నాయకులు దాసరి అఖిల్, అరిస్టాటిల్, సృజన్, మల్లేశ్ సాయి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మత్స్యకారుడి మృతి

కమలాపూర్, జూలై 28 : మండల కేంద్రానికి చెందిన మత్స్యకారుడు మౌటం రాజేశ్ (26)ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో మృతి చెందినట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. రాజేశ్ చేపలు పట్టేందుకు పెద్దచెరువులోకి వెళ్లాడు. చెరువులో చేపలు పడుతుండగా చేపల కోసం వేసిన వల రాజేశ్ కాళ్లకు చుట్టుకుని చెరువులో నీటిలో మునిగిపోయాడు. తోటి మత్స్యకారులు చూసి వెంటనే రాజేశ్‌ను బయటకు తీసి దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. అతడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు

హసన్‌పర్తి, జూలై 28 : మండల కాంగ్రెస్‌లో కల్లోలం మొదలైంది. పార్టీ మండలాధ్యక్షుడు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఎంపీ ఎన్నికల్లో మొదలై అదికాస్త చిలికిచిలికి గాలివానలా తయారైంది. మండల కేంద్రానికి ఎమ్మెల్యే వస్తే పార్టీ నాయకులే ఆయనను నిలదీసిన పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే వద్ద నుంచి కొంతమంది నాయకులకు మాత్రమే సమాచారం వస్తుందని, వారు కింది స్థాయి నాయకులను కలుపుకుని పోవడం లేదని మండల, డివిజన్, గ్రామ స్థాయి సీనియర్ నాయకులు మదన పడుతున్నారు. కిసాన్‌సెల్ జిల్లా నాయకుడు మండలంలో తన గ్రూపును తయారు చేసుకోవడం కోసం పార్టీ నాయకుల మధ్య వైరం పెంచుతున్నాడని సీనియర్ నాయకులు ఎమ్మెల్యే వద్ద గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం. ఇద్దరి మధ్య వైరం పెరిగి అది కాస్త తనవర్గంలో ఉన్న అనుకున్న వారికే నామినేటెడ్ పదవులు ఇప్పించుకోవడం కోసం ఎమ్మెల్యే చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నట్లు సమాచారం. ఇద్దరి నాయకులను ఎలా సమన్వయం చేయాలనే సందిగ్ధంలో ఎమ్మెల్యే తల పట్టుకున్నట్లు తెలుస్తున్నది.

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'

దామెర, జూలై 28 : అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నల్గొండ పార్లమెంట్ ఇన్‌చార్జి చాడ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ల్యాదెళ్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2500, ఉచిత కరెంటు, డబుల్ బెడ్ రూంలు ఏమయ్యాయని నిలదీశారు. రైతు భరోసా లేదని, పూర్తిస్థాయిలో రూణమాఫీ జరగలేదన్నారు. కేవలం అధికారం కోసమే ఆ పార్టీ ప్రజలకు మోసపూరిత హామీలను ఇచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, మంద ఐలయ్య, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేద్దాం..

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. శాయంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం లో ప్రజల నిర్ణయమే తలమానికమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు కూడా బడ్జెట్‌లో పెట్టలేదని ఆరోపించారు. అభివృద్ధిపై కాంగ్రెస్‌కు స్పష్టమైన విజన్ లేదన్నారు. మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విజయ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభకార్యాలు, విహారయాత్రలకు అద్దె బస్సులు

హనుమకొండ చౌరస్తా, జూలై 28 : వివాహాది శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ అద్దె ప్రతిపాదికన పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ, గరుడ ప్లస్ బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు ఆర్‌ఎం విజయభాను తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సురక్షిత ప్రయాణం చేయాలని, బస్సులు కావాలనుకునేవారు 99592 26047-49, 73828 55793, 7382852344 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తే కేసు నమోదు చేస్తాం

హసన్‌పర్తి, జూలై 28 : బీటీ, సీసీ రోడ్డుపైన కేజ్‌వీల్స్‌తో వెళ్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై దేవేందర్ హెచ్చరించారు. మండలంలోని మడిపల్లికి చెందిన మాచర్ల సాయి తన ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో ఆదివారం గ్రామంలోని బీటీ రోడ్డుపైన వెళ్తుండగా, ఎస్సై దేవేందర్ అతడిని ఆపి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కమలాపూర్, జులై 28 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎస్‌జే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సుమారు 400మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు లావణ్య, ఆసిఫ్ ఇక్బాల్, అనూష, రాకేశ్, భక్తవ త్రాజీ, రహమాన్ ఖాన్, సిబ్బంది రాణి, సంధ్య, కుమారస్వామి, నిర్వాహకులు శ్రీకాంత్, నాగరాజు, సుభాశ్, సతీశ్ పాల్గొన్నారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ సీజ్

ఐనవోలు, జూలై 28 : రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నందనం రెవెన్యూ శివారు లింగమోరిగూడెం పరిధిలో అక్రమంగా మట్టి ఇసుక నిల్వ చేశారని 100 డయల్‌కు వచ్చిన సమాచారం అక్కడికి వెళ్లి ఎక్స్‌కవేటర్, టిప్పర్, పున్నేల్ గ్రామ శివారులో వడ్డెరగూడెం వద్ద అక్రమంగా మొరం తరలిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక, మట్టిని అక్రమంగా రవాణా చేసినట్లు తమ దృష్టికి వస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తన

శాయంపేట, జూలై 28 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలోని శ్రీరామదాసు భజన మండలి, వేంకటేశ్వర ధార్మిక భజన మండలి బృందాలు తిరుమల తిరుపతి దేవస్థానం లో హింద